వర్సిటీల బలోపేతానికి కృషిచేయాలి

ఓయూలో పలువురు వక్తల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: యూనివర్సిటీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థి నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించాలని కోరారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో 'నూతన ప్రభుత్వం - ప్రభుత్వ విశ్వవిద్యాలయాల సమస్యలు-పరిష్కారాలు'పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్లు కొండా నాగేశ్వర్ రావు, ఆమంచి నాగేశ్వరరావు హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వర్సిటీల అభివృద్ధికి ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తాజా బడ్జెట్ కేటాయింపులే నిదర్శనమని అన్నారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన బాగానే ఉన్నా రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ వర్సిటీ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం నిధులు పెంచాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ఓయూతో సహా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ప్రాతిపదికనే నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓయూ విద్యార్థులకు ప్రత్యేక ఫెలోషిప్ పథకాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విద్యాశాఖను ముఖ్యమంత్రే స్వయంగా నిర్వహిస్తున్నందున విద్యార్థులు తమ సమస్యలు చెప్పుకునేందుకు వారంలో కనీసం రెండు రోజులు అవకాశం కల్పించాలని అన్నారు. వర్సిటీలకు రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్లను నియమించకపోవడంతో విద్యావాతావరణం గాడి తప్పిందని వాపోయారు. తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి కంటే విద్యావ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఎస్.నాగేశ్వర్‌రావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు స్వరూప, విద్యార్థి నాయకులు కోట శ్రీనివాస్, కంచర్ల బద్రి, ఆంజనేయులు, ఉదయ్‌కుమార్, రెడ్డి శ్రీనివాస్, వలిగొండ నరసింహ, శరత్‌నాయక్, మేడ శ్రీను, తాళ్ల అజయ్, జంగిలి దర్శన్, నామ సైదులు, ఆజాద్, సునీల్‌కుమార్, రవీందర్‌నాయక్, ఎన్.సుమంత్, స్వాతి, రుక్మత్ పాషా, కోటేశ్వర్, క్రాంతి, భువన, ప్రణీత, ఆర్తి, ప్రత్యూష, అక్షర, శ్రావణి, మధు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

వృద్ధుల కోసం ఆయుష్ ఆరోగ్య శిబిరం

వయో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సికింద్రాబాద్, ఆగస్టు 12: అనారోగ్యంతో బాధపడుతున్న వయోవృద్ధుల కోసం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చిలకలగూడ చింత బావిలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. చిలకలగూడ ప్రభుత్వ యునాని డిస్పెన్సరీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత రాథోడ్, డాక్టర్ రమ శ్రీదేవి, డాక్టర్ మంజుల నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వయో భారంతో వచ్చే సమస్యలు మోకాళ్ల, నడుము, కీళ్ల నొప్పులు, వాతం సమస్యలతో బాధపడుతున్న వారికి నిర్వహించారు. శిబిరంలో ఫార్మసిస్ట్ దేవి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ప్రోగ్రాం అధికారి వరకాల శ్రవణ్‌కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

లాల్‌బజార్‌లో ఉచిత వైద్యశిబిరం

బొల్లారం: ప్రాంగాణంలో సోమవారం కంటోన్మెంట్ తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అవంతి, సిబ్బంది సునీత, ఆశా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే చేపట్టాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

కళాసీగూడలో పర్యటిస్తూ స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఆగస్టు 12: పెండింగ్ పనులను వెంటనే చేపట్టి ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాన్ని తొలగించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాంగోపాల్ పేట్ డివిజన్ కళాసీగూడలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. కళాసీగూడ నాలా వెంట రోడ్డు నిర్మించక పోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు మందే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామని, వెంటనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వకుండా సీవరేజీ లైన్‌ను ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పర్యటిస్తున్న సమయంలో పలు చోట్ల చెత్త కనిపించడంతో వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులతో చెప్పారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని అన్నారు. కలుషిత నీరు సరఫరా అవుతుందని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పైపులైన్లు సరిచేసి మంచినీరు సరఫరా అయ్యేవిధంగా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం ఆశీష్, రాంగోపాల్‌పేట్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లింగసమానత్వం సాధిస్తేనే అభివృద్ధి

నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్ ఎన్.వాసంతి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: లింగసమానత్వాన్ని సాధించినపుడే ఏ దేశమైనా అభివృద్ధి సాధిస్తుందని నల్సార్ వర్సిటీ ప్రొఫెసర్ ఎన్.వాసంతి అన్నారు. మన దేశంలో లింగ వివక్షను ఎదుర్కొంటూ కూడా మహిళలు అన్నిరంగాల్లో దూసుకుపోతున్నారని గుర్తుచేశారు. ఓయూలోని మహాలఖా బాయి చందా సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో 'జెండర్ అండ్ లా'అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ వాసంతి మాట్లాడుతూ రాజ్యాంగ ప్రవేశిక ప్రాముఖ్యతను వివరించారు. చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సాధికారత సాధించి, అన్నిరంగాల్లో సమాన అవకాశాలు సాధించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఓయూ మైనారిటీ సెల్ డైరెక్టర్, మహాలఖా బాయి చందా సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ సయీదా అజీమున్నీసా, అంబేద్కర్ రీసర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు, జ్యోతిబాపూలే రీసర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లమల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్.వాసంతి

ఖండాంతరాల్లో స్వాతంత్ర్య వేడుకలు

ఆస్టిన్ నగరంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ లక్కరాజు నిర్మల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: అమెరికా దేశంలోని టెక్సాస్ రాష్ట్ర రాజధాని ఆస్టిన్ నగరంలో జరిగిన భారత స్వాతంత్ర్య దినోత్సవంలో అతిథిగా ప్రముఖ రచయిత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ లక్కరాజు నిర్మల హాజరయ్యారు. క్యాపిటల్ భవనంలో ఈనెల 9 నుంచి 15వ వరకు నిర్వహిస్తున్నారు. నిర్మల మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకలను ఖండాంతరాలు దాటి నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనను అతిథిగా ఆహ్వానించడం గర్వంగా ఉందని చెప్పారు.

క్లాసిక్ గార్డెన్‌లో వస్త్ర ప్రదర్శన షురూ..

మారేడ్‌పల్లి, ఆగస్టు 12: బాలంరాయి క్లాసిక్ గార్డెన్‌లో స్కిల్ ఆఫ్ ఇండియా ఎక్స్‌ఫోను సోమవారం టాలీవుడ్ నటి, బిగ్‌బాస్ ఫేం అశ్వినిశ్రీ సందడి చేశారు. నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిజిత్ షాలతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం పలు రకాల చేనేత చీరలను ప్రదర్శించారు. ఈనెల 18వరకు ప్రదర్శణ కొనసాగుతుందని వెల్లడించారు.

వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేయనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఏ, బీకాం, బీబీఏ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

కామర్స్ విభాగం హెడ్‌గా ప్రొ.గంగాధర్

అభినందిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: ఓయూ కామర్స్ విభాగం హెడ్‌గా ప్రొఫెసర్ ఎం.గంగాధర్ నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ హెడ్ ప్రొఫెసర్ చెన్నప్ప, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్లు ఐ.శేఖర్, నరేశ్‌రెడ్డి, ప్యాటిక్, సీవీ రంజని, కవితా దేవి, డాక్టర్ కొర్రెముల శ్రీనివాస్. డాక్టర్ బి.సంధ్య, డాక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు ప్రొఫెసర్ గంగాధర్‌ను అభినందించారు.

సమస్య పరిష్కారానికి కృషి

మారేడ్‌పల్లి, ఆగస్టు 12: డైనేజీ సమస్య పరిష్కరానికి కృషి చేస్తున్నానని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. సోమవారం నాలుగో వార్డు పికెట్ రాంనగర్‌లో పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కరానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయానంద్, రాజమల్లేశ్, ప్రేమ్‌కుమార్, అరవింద్, నాగభూషణంరెడ్డి, జగన్ పాల్గొన్నారు.

సీసీ పనులు పరిశీలించిన కార్పొరేటర్

మైలార్‌గడ్డలో పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఆగస్టు 12: మైలార్‌గడ్డలో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ హేమ పరిశీలించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ఉండేందుకు మైలార్‌గడ్డలో జరుగుతున్న పనులను జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్‌తో కలిసి కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రూ.54 లక్షల వ్యయంతో పనులను చేపట్టినట్టు ఆమె తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరైన పనులు, ఎన్నికల ముందు ఆగిపోయాయని ఆ పనులే ఇప్పుడు కొనసాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దోషులను అదుపులోకి తీసుకోవాలి

ఈఎస్ఐసీ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

అమీర్‌పేట్, ఆగస్టు 12: కోల్‌కత్తాలోని ఆర్‌జీకేఏఆర్ ఆసుపత్రి వైద్యురాలి దారుణ హత్యను నిరసిస్తూ సోమవారం సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆవరణలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. నిందితులను వెంటనే గుర్తించి శిక్షించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈఎస్ఐసీ డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ శ్రావ్యలతో కలిసి వైద్యులు నినాదాలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ డాక్టర్ మౌనిత పనిచేస్తున్న ఆసుపత్రి సెమినార్ హాల్‌లో శవమై కనిపించడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందన్నారు. వైద్యులకు రక్షణ లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. జూనియర్ డాక్టర్ మరణానికి కారకులైన హంతకులను అరెస్టు చేయాలని ఆసుపత్రి గేటు దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. వైద్యుల నిరసనకు వైద్య కళాశాల డీన్ డాక్టర్ శిరీష్‌కుమార్ జి.చవాన్ సంఘీభావం ప్రకటించి నిరసనలో పాల్గొన్నారు.

డెత్ రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


సాయిప్రసాద్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి

మారేడ్‌పల్లి, ఆగస్టు 12: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయి కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడు కె.సాయిప్రసాద్ ఇటీవల మృతి చెందాడు. యాక్సిడెంట్ డెత్ రిలీఫ్ ఫండ్ (ఎడీఆర్ఎఫ్) నుంచి మంజూరు అయిన రూ.5లక్షల చెక్కును సీసీఎస్ ప్రెసిడెంట్ చిలుకు స్వామి గురువారం ఎస్అండ్‌టీ వర్క్‌షాపులో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వర్క్‌షాపు డివిజన్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, ప్రెసిడెంట్ నవీన్, డైరెక్టర్లు బాలకృష్ణరెడ్డి, డి.కుమార్, రాజేందర్, రామదేవి, ఆర్‌వైనాయక్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామలకు అభినందన

మెడల్స్ సాధించిన ఏఎస్ఐ శ్యామలను అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

బేగంపేట్, ఆగస్టు 12: అథ్లెటిక్స్‌లో మెడల్ సాధించిన ట్రాఫిక్ ఏఎస్ఐ శ్యామలను మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అభినందించారు. సైఫాబాద్‌లో ట్రాఫిక్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్యామల గత నెల 12 నుంచి 24 వరకు అమెరికాలోని క్లివ్‌ల్యాండ్ ఓహియోలో పాన్ అమెరికన్ మాస్టర్స్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భారత్ తరపున శ్యామల బ్రాంజ్ మెడల్‌ను గెలుచుకుంది. సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తాను గెలుచుకున్న బ్రాంజ్ మెడల్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని గెలుచుకున్న మెడల్స్‌ను చూపించి వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ ఆ మెడల్స్‌ను ఆమె మెడలో వేసి అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని రాణించాలని ఆకాంక్షించారు.

రక్షాబంధన్ వేడుకలకు డిప్యూటీ మేయర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: బ్రహ్మకుమారీస్ తార్నాక యూనిట్‌లో జరుగనున్న రక్షాబంధన్ వేడుకలకు నిర్వాహకులు నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిని ఆహ్వానించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసిన బ్రహ్మకుమారీలు తమ ఆశ్రమానికి వచ్చి వేడుకల్లో భాగం కావాలని కోరారు.

వేడుకలకు డిప్యూటీ మేయర్‌ను ఆహ్వానిస్తున్న బ్రహ్మకుమారీలు

ఎన్ఈపీ కార్పొరేట్‌కు అనుకూలం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఓయూలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ మాజీ నేత, ఓయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ యు.ఎల్లేశ్ హాజరయ్యారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ జెండా ఎగురవేసి, విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. పర్యావరణ, విద్యారంగ పరిరక్షణకు బలమైన విద్యార్థి ఉద్యమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఎన్ఈపీ పేరుతో విద్యను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. పర్యావరణ పరిరక్షణకు నేటి విద్యార్థులు అగ్రభాగాన నిలవాలని సూచించారు. బ్రిటిష్ ముష్కర పాలనను అంతం చేసి దేశంలో ఉన్న పీడిత, శ్రామికవర్గాల కోసం విద్యార్థులను జాతీయ ఉద్యమంలో భాగస్వాములను చేసేందుకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయ సాధన కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం 1936 ఆగస్టు 12న బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. దేశంలో మొట్టమొదటిసారిగా ఆవిర్భవించిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో వేలాదిమంది విద్యార్థి వీర కిషోరాలను దేశం కోసం త్యాగం చేసిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య అనంతరం అన్ని వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాటం చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, నాయకులు భగత్, రాధాకృష్ణ, అశ్వన్, మధు, శివ, రాఘవేందర్, బాలాజీ, వివేక్, శ్రీనాథ్, బాబూరాజు, లింగస్వామి, వెంకటేశ్, అనిల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరించిన ఓయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ యు.ఎల్లేశ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మారేడ్‌పల్లి, ఆగస్టు 12: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకర్‌రావు పిలుపు మేరకు సోమవారం మజ్దూర్ యూనియన్, డీఓబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఎదుట నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. డివిజనల్ ఆఫీసు బ్రాంచ్ మేనేజర్ సలీం, ఆఫీసు బెరర్స్ వైద్యనాథ్‌సింగ్, మధు, రోషన్ మాట్లాడుతూ 18 నెలల బకాయి డీఏ, అలవెన్స్ వెంటనే చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 8వ పే కమిషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని అన్నారు. బకాయి, అలవెన్స్ చెల్లించకుండా రైల్వేబోర్డు కాలయాపన చేస్తుందన్నారు. రైల్వే కార్మికులందరూ ఐక్యంగా ఉండి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే యూత్ కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

రైల్వే డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహిస్తున్న డీఓబీ బ్రాంచ్ మేనేజర్ సలీం, తదితరులు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

సికింద్రాబాద్, ఆగస్టు 12: నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రజావాణిలో జెడ్సీకి లిఖిత పూర్వకంగా వినతిపత్రం సమర్పించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జీప్లస్ 2 అనుమతులు పొంది ఇష్టానుసారంగా నాలుగు, ఐదు అంతస్తులు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలపై కొరడా జులిపించాలని కోరారు. అదనపు అంతస్తుల నిర్మాణాలు, సెట్‌బ్యాక్ కూడా ఉండవన్నారు. అంతే కాకుండా రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. ఏదైనా ప్రమాదం జరిగితే అంబులెన్సులు కూడా రావని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, తమ ప్రాంతంలోని స్థలాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బండి అభిషేక్ ముదిరాజ్, మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు రవి తదితరులు పాల్గొన్నారు.

'శిథిలావస్థకు చేరిన ఇంటిని తొలగించండి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: తార్నాక డివిజన్ లాలాపేటలో శిథిలావస్థకు చేరిన ఇంటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సీతారామాంజనేయ భజన సమాజ్ సమీపంలో ఉన్న ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో అది ఎప్పుడు కూలుతుందో తెలియకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా జరగకూడనిది జరిగి ప్రాణనష్టం జరిగితే బాధ్యులెవరని ప్రశిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి, చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే మేల్కొని ఇటువంటి పాత కట్టడాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్1, ప్రిలిమ్స్ అర్హులకు అవగాహన తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: గ్రూప్ 1, సివిల్స్ పరీక్షల్లో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఓయూ విద్యార్థులకు త్వరలోనే సివిల్ సర్వీసెస్ అకాడమీలో అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులకు హాజరయ్యేందుకు అసక్తి ఉన్నవారు వచ్చే నెల 2లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఓయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీలో చదివే విద్యార్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు.

'వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 12: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీసగ గోపి, యువజన విభాగం అధ్యక్షుడు బోయ రమేశ్ డిమాండ్ చేశారు. దశాబ్దాల నుంచి ఉద్యమాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం నియమించిన చెల్లప్ప కమిషన్ వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సిఫార్సు చేసిందని చెప్పారు. రిపోర్టు ఆధారంగా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని గుర్తుచేశారు. కానీ వివిధ కారణాలరీత్యా ఇంతవరకు ఎస్టీ జాబితాలో చేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బ